క్లుప్తంగా

పేరు మార్పు కోసం ఎమ్మెల్యేకి వినతి

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి హైస్కూల్ పేరు మార్పు చేయాలని ఎమ్మెల్యే, టీటీడీ సభ్యులు జ్యోతుల నెహ్రూకు గురువారం ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న హై స్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కాలేజీగా పేరు మార్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గత రెండేళ్లుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను శాశ్వత ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్‌గా నియమించాలన్నారు. జెడ్పీ, పీజీటీ ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ధర్మరాజు, నానిబాబు, సత్యవతి, రాము, అచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వినూత్న నిరసన



27 నంబర్ ఆకారంలో కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఏలేశ్వరం: చిన్నింపేట గ్రామంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఆందోళలను ప్రారంభమై 27 రోజులు కావడంతో 27 నంబర్‌గా ఏర్పడి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం తమకు న్యాయం చేయాలన్నారు. ఫ్యాక్టరీ మూసివేతతో 409 కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు సమ్మె విరమణ



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తుని: మున్సిపల్ ఉన్నతాధికారులు జీతాలు పెంచుతామంటూ ఇచ్చిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు శ్రీదుర్గా మున్సిపల్ కాంట్రాక్టర్ వర్కర్స్ వేల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు యినుగంటి శరణ్‌కుమార్ గురువారం తెలిపారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తోన్న కార్మికులతో డీఎంఏ, కమిషనర్ చర్చలకు పిలిచారన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో చర్చలకు పిలిచి జీతాలు పెంపుదల చేస్తామని చెప్పారన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో విఫలమైతే సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు విధులకు హాజరు కావాలని శరణ్‌కుమార్ కోరారు.

నేడు మాదిగల ఆత్మీయ సమ్మేళనం

తొండంగి: ఏలూరి జిల్లాలోని నూజివీడులో శుక్రవారం జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కొండేపూడి శ్యామ్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని ఒంటిమామిడిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఈ సభను మాదిగలు, ఉప కులాల ప్రజలు హాజరై విజవయంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరుగుల మోషే, పెదపూడి గవరయ్య, కాకాడ సింగన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం



జె.అన్నవరంలో నియామక పత్రం అందజేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు

ఏలేశ్వరం: బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. పార్టీ మండల కన్వీనర్ కురాకుల రాజా ఆధ్వర్యంలోని మండల పరిధిలోని జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం గ్రామాల్లో గురువారం బూత్‌స్థాయి అధ్యక్షులను ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. జె.అన్నవరం 6వబూత్ అధ్యక్షుడుగా జంగారెడ్డి వీరభద్రరావు, తూర్పులక్ష్మీపురం 8, 9 బూత్ అధ్యక్షులుగా మీసాల వీరబాబు, పతివాడ వెంకటేశ్వరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో బీజేపీని పటిష్టం చేయడమే తమ లక్ష్యమన్నారు. ఎన్నికల అధికారిగా ఊటా వీరబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణం.. జరభద్రం!

- ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న పోలీసు అధికారులు
- మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహనాల సీజ్



రోడ్డు భద్రతా చట్టాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కిర్లంపూడి: నిదానమే ప్రధానం. నిర్లక్ష్యం, అతి వేగం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం సాగిస్తే అనుకున్న గమ్యానికి చేరుకుంటాం. ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసు అధికారులు పదే పదే చెబుతున్నారు. ఈ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వారు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో సుమారు 25 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఈ రహదారిలో అధిక సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ హైవేలో నిర్లక్ష్యం, అతి వేగంతో వచ్చే వాహనాల కారణంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక గ్రామాల జంక్షన్ల వద్ద రోడ్డుక్రాస్ చేసే సమయంలో ప్రజలు ప్రమాదబారిన పడుతున్నారు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు అధికారులు నడుం బిగించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో పెద్దాపురం ఎస్‌డీపీఓ శ్రీహరి, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి ఎస్సైలు జి.సతీష్, టి.రఘునాథరావు, శివనాగబాబు ప్రధాన రహదారుల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేశారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

జగ్గంపేట నియోజకవర్గంలో ప్రతిరోజూ సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇటీవల పిల్లల సరదాలను దృష్టిలో పెట్టుకుని మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మైనర్లు కొత్తగా వాహనాలు నడుపుతూ పరిమితికి మించి వేగంగా డ్రైవ్ చేస్తున్నారు. అటువంటి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు 18 సంవత్సరాలు పైబడి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలని సూచిస్తున్నారు. మొదటి సారి వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.535 జరిమానా, రెండోసారి పట్టుబడితే జరిమానాతో పాటు వాహనం సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తారు. వాహన దారుడు మద్యం తాగినట్లు కోర్టులో రుజువైతే రూ.12 వేలు వరకూ జరిమానా, 3 నుంచి 7 నెలలు వరకు జైలు శిక్ష విధిస్తున్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఎనలైజర్ చెకింగ్

నిబంధనలు ముఖ్యం

వాహన చోదకులు వద్ద రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఆటోల్లో మితిమీరిన ప్రయాణికులను ఎక్కించినా, మారకద్రవ్యాలు, మత్తుపదార్థాలు తరలించినా నేరమని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. రోడ్డు జాతీయ రహదారుల వెంబడి ఉన్న దాబాల వద్ద వాహనాలు నిలిచిపోకుండా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు.

బ్లాక్ స్పాట్స్ వద్ద చర్యలు

కిర్లంపూడి నుంచి గండేపల్లి మధ్య జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వేగంగా వచ్చే వాహనాల వల్ల ద్విచక్ర వాహనదారులు, కాలినడక వెళ్లే వారు తరచూ ప్రమాదాలు బారిన పడే అవకాశం ఉంటుంది. దీంతో వాహనాల వేగం తగ్గించేందుకు బ్లాక్ స్పాట్స్ వద్ద బార్ గేట్లను అమర్చారు.

నిర్లక్ష్యంగా ఉంటే జీవితం నాశనం



రోడ్డు భద్రతా చట్టాలపై ప్రతి రోడ్డు వినియోగదారులకు అవగాహన కలిగిస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు అవుతున్నాయి. మెనార్టీ తీరని పిల్లలకు మోటారు సైకిళ్లు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు నడిపై సమయంలో హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తున్నాం.

– వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట సీఐ

అరుణోదయ సభలను జయప్రదం చేయాలి

గండేపల్లి: ఈనెల 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 50వ అరుణోదయ సభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కె.గోపాలపురంలో గురువారం అరుణోదయ కరపత్రాల ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1972లో కామ్రేడ్ జార్జి రెడ్డి హత్యతో విప్లవ సాంస్కృతిక సైన్యానికి బాటలు వేస్తూ 1974లో ఏప్రిల్ 14న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ నాయకత్వంలో సమాలోచనలు జరిగి మే 12న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏర్పడిందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సతీష్, నూకరత్నం, రాజు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల జైలు శిక్ష

శంఖవరం: మద్యం సేవించి లారీని నడిపిన కారణంగా ఆ డ్రైవర్‌కు 15 రోజులు జైలు శిక్ష విధించారు. అన్నవరం పోలీస్ స్టేషన్ ఎస్సై జి.హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం ప్రత్తిపాడు నుంచి అన్నవరం వైపు వస్తున్న లారీ డ్రైవర్ పూర్తిగా మద్యం తాగి మత్తులో ఉండి తన లారీని అటూ ఇటూ ప్రమాదకరంగా నడుపుతున్నాడు. దీనిని గమనించిన ఓ వ్యక్తి అన్నవరం పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి లారీని ఆపి, డ్రైవర్‌ను పరీక్షించగా మద్యం సేవించినట్టు ధ్రువీకరించారు. దీంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. విచారణలో నేరం రుజువైనందున న్యాయమూర్తి డ్రైవర్‌కు 15 రోజులు పాటు కారాగార శిక్ష విధించినట్టు తెలిపారు.

రెవెన్యూ సదస్సులకు పది అర్జీలు



జగపతినగరంలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిరంజీవి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎండోమెంట్ అధికారి

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 10 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ జె.చిరంజీవి తెలిపారు. జగపతినగరం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులకు సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ తమ భూ సరిహద్దుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటి తహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి తదితరులు ఉన్నారు.

కృష్ణునిపాలెంలో రెవెన్యూ సదస్సు

గోకవరం: కృష్ణునిపాలెంలో తహసీల్దార్ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. కృష్ణునిపాలెం నుంచి కొత్తూరూ వెళ్లే దారిలో ఉన్న గుబ్బాలమ్మగుడి వెదురు ఉన్న శ్రీరామ ధర్మసత్రానికి చెందిన 183/3ఎ3సీ సర్వే నంబర్‌లో గల 1.94 ఎకరాల్లో అక్రమంగా లేఅవుట్లు వేశారంటూ ఎండోమెంట్ అధికారి సుబ్బారావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపడతామని తహసీల్దార్ అన్నారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు



సోమవరంలోని ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కిర్లంపూడి: నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే షాపు డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఇంటర్నల్ తనిఖీ అధికారి ఏడీఏ కె.బాబూరావు అన్నారు. మండలంలోని సోమవరం, బూరుగుపూడి గ్రామాల్లో ఎరువుల షాపులను సందర్శించి ఎరువులు నిల్వ నమోదు రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల షాపుల్లో స్టాక్ వివరాల రిజిష్టర్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఎరువుల రేటు పట్టికను షాపు ఎదురుగా ఉంచాలన్నారు. ఏఓలు జోకా అమృత, పడాల వెంకటలక్ష్మి, వీఏఏలు శ్యామ్‌కుమార్, శ్రీను, సందీప్ తదితరులు ఉన్నారు.

రోడ్లపై పశువులతో ఇబ్బంది



తుని రాజా కళాశాల మైదానంలో సంచరిస్తున్న పశువులు

తుని: రోడ్లపై తిరుగుతున్న పశువులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అధికారులు, ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు ప్రజారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా కొన్నింటిని పట్టుకుని జిల్లా కేంద్రంలోని సంరక్షణ కేంద్రానికి తరలించిన విషయం తెలిసిందే. ఆ పశువులక సంబంధించిన యాజమానులు అంతగా స్పందించలేదు. దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సహకారంతో వీధి పశువుల పోషణకు సహకరించారు. పశువులకు అవసరమైన గ్రాసం, నీటిని అందించారు. దీంతో కొంత వరకు అడ్డుకట్ట పడింది. అధికారులు యాజమానులకు నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో వదిలేశారు. తాజాగా ఏ రోడ్డులో చూసినా పశువులు దర్శన మిస్తున్నాయి. మార్కెట్‌కు వచ్చే ప్రజలు కొను గోలు చేసిన కూరగాయాలు, ఇతర వస్తువులను తినేస్తున్నాయి. పట్టణంలోని అన్నింటిని పట్టుకుని గోసంరక్షణ కేంద్రాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లగా ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. ఇకపై ఎవ్వరికి అవకాశం ఇవ్వమని, దొరికిన పశువులను స్వాధీనం చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు కుర్చీల వితరణ



వేమవరంలో అంగన్‌వాడీ సెంటర్‌కు కుర్చీలు అందజేసిన దృశ్యం

తొండంగి: మండలంలోని వేమవరం, పంపాదిపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్చీల పంపిణీ కార్యక్రమం జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలను అందజేశారు. అదేవిధంగా తొండంగి జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు జాతీయ నాయకుల చిత్రపటాలను అందజేయడంతోపాటు కాకినాడ గోశాలలో ఆవుల పశుగ్రాసం నిమిత్తం తోటకూర అందజేత వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి సహస్ర లిల్లీ పుష్ప పూజ

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారికి సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఐదో రోజు గురువారం సహస్ర లిల్లీ పుష్ప పూజ నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి పాదగయ క్షేత్రంలో సప్తాహ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతుండగా ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్ర భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: రామచంద్రపురంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ముగింపును పురష్కరించుకుని గురువారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతలు, జనసేన జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, తుమ్మలపల్లి సాయి చంద్రశేకర్ మాట్లాడుతూ ప్రతి ఏటా స్వామి వారి ఆలయకమిటీ ,ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పులువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకోవాలి



ఎ.కొత్తపల్లి కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

తొండంగి: ఎ.కొత్తపల్లి శివారు జగ్గారావు బీడులో కాలనీని హౌసింగ్ పీడీ డి.సత్యనారాయణ గురువారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా పూర్తి కాని నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ గుప్తా, డీఈ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేశ్వరరావు, ఏఈ ఆనంద్ తదితరులు ఉన్నారు.

మాల మహాగర్జనను జయప్రదం చేయాలి

కిర్లంపూడి: ఈ నెల 15న గుంటూరు జిల్లా పల్లపాడులో నిర్వహించే మాల మహాగర్జన భారీ బహిరంగ సభకు మాలలంతా తరలివచ్చి జయప్రదం చేయాలని మాల మహనాడు సభ్యులు కోరారు. స్థానిక దళితపేటలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం రాత్రి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేసే దిశగా పనిచేస్తున్నారని, దానిని మనమంతా తిప్పికొట్టాలన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడు

పిఠాపురం: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురానికి చెందిన పి.కృష్ణ ఎంపికైనట్టు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ నెల 12వ తేదీన రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీలలో పిఠాపురం సీబీఆర్ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ సెకండియర్ చదువుతున్న కృష్ణ ఇండియన్ రౌండ్ ఇండివిడ్యువల్ ఆర్చరీ ఈవెంట్లో రజిత పథకం సాధించాడని ఆయన తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి 27వ వరకూ ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటున్నట్లు కోచ్ తెలిపారు.

ముద్రగడ గిరిబాబు నాయకత్వంలో పార్టీ బలోపేతం



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, గిరిబాబును కలిసిన అభిమానులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో గురువారం ఆయనను, యువనాయకుడు గిరిబాబును పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రజలతో తన కున్న అనుబంధాన్ని ముద్రగడ పద్మనాభం వారితో పంచుకున్నారు. ఉపసర్పంచ్ మదినే నూకరాజు, కట్టమూరి కొండబాబు, సుబ్బలక్ష్మి, మేడిబోయిన బాలరాజు, ముమ్మిడి అప్పన్న, పెదపాటి సుజాత, దిడ్డి ఏసుబాబు, ధర్మాల సరోజినిదేవి, మేగం గంగబాబు, నల్లమిల్లి నానాజీ తదితరులు ఉన్నారు.

ఎంఎంఆర్ ట్రస్ట్ ప్రారంభం



ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి

ప్రత్తిపాడు: సామాజిక సేవా కార్యక్రమాల అమలు చేయడం ద్వారా పేద ప్రజలకు చేయూత నందించేలా ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు విస్తరించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రత్తిపాడులో గురువారం చిన జీయర్ స్వామి ప్రారంభించారు. విద్య, వైద్యం, అన్నదానం, నిరుపేదలకు వస్త్రదానం, నిరుపేదల గృహాల నిర్మాణానికి చేయూత నందించడం, పేదల కల్యాణాలకు ఆర్థిక సాయం అందించడం , దివ్యాంగులకు సహాయపడాలన్న లక్ష్యంతో ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు ముదునూరి మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

15తో ముగియనున్న అపరాల పంట బీమా గడువు

తొండంగి: రబీ పంటగా అపరాలు సాగు చేసిన రైతులు తమ పంటకు బీమా గడువు ఈనెల 15వ తేదీతో ముగుస్తుందని ఏఓ ఎస్.నరసింహం తెలిపారు. మండలంలోని పంపా ఆయకట్టు పరిధితోపాటు ఇతర ప్రాంతాల్లో ఖరీఫ్ వరిపంట కోతల అనంతరం ఇప్పటికే 700 హెక్టార్లలో అపరాలు సాగు చేస్తున్నారన్నారు. అపరాల సాగు చేస్తున్న రైతులందరూ తమ పంటను ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతే పరిహారం పొందేందుకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు.

మండల అధికారులు

కోటనందూరు:

తహసీల్దార్	టి.సుభాష్	8008803205
ఎంపీడీఓ	వెంకటనారాయణ	98496 63415
మండల వైద్యాధికారి	యామిని కావ్య	76750 32399
వ్యవసాయాధికారి	కేజే చంద్రశేఖర్	83310 56617
ఎంఈఓ-1	ఏవీఎస్ శ్రీనివాస్	89856 02864
ఎంఈఓ-2	రామశేఖర్	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	ఎం.రత్నతేజ	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	ప్రదీప్‌కుమార్	94919 34613
ఎస్సై	టి.రామకృష్ణ	94409 00773
వెలుగు ఏపీఎం	పి.సూర్యకుమారి	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ	రాజగోపాల్	70939 98217
ఏఎస్ఓ	ఎస్.వామనమూర్తి	989796696

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ-2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	– 97014 77778